# దీర్ఘాయుష్మాన్ భవ!

నారాయణమూర్తిగారొచ్చి పెళ్ళి సంబంధం గురించి చెప్తుంటే తలుపు చాటుగా విన్న ప్రభావతి మనసు తొందరపడడం మొదలుపెట్టింది. అప్పుడప్పుడు పెళ్ళి ఊహ వచ్చినా, ఈవేళ, ఈ సంబంధం గురించి విన్నాక నిముషాల మీద యిది ఖాయమైపోతే బాగుండును అనిపిస్తోందామెకి.

ప్రభావతి పదేళ్ళ పిల్లగా ఉన్నప్పుడు తల్లిపోయింది. ఆనాడు తల్లి శవం మీద పడి ఏడుస్తున్న తండ్రిని చూసిన ఆ పసి హృదయం తండ్రి మళ్ళీ పెళ్ళిచేసుకుంటాడని ఊహించలేకపోయింది. కానీ చుట్టాలూ పక్కాలూ అంతా తలొక మాటా, సలహా యిచ్చారు. ఫలితంగా ఏడాది తిరిగేసరికి తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకోవడాన్ని ఎవ్వరూ ఆక్షేపించలేదు. ఎందుకంటే అది లోకసహజమే కనుక. కాని ప్రభావతి మాత్రం చిన్నబుచ్చుకుంది.

భ్రమరాంబ వచ్చిన నాటి నుంచి ప్రభావతి స్వేచ్ఛ పూర్తిగా హరింపబడింది. నోరు విప్పి చెప్పకుండానే ఇంటెడు చాకిరీ చేయించి ప్రభావతిని మరీ స్కూలుకి పంపేది భ్రమరాంబ. సాయంత్రం కాస్త అటు యిటూ వెళ్ళాలన్నా "మరి వంటెవరు చేస్తారు?" అనే ఆలోచన ప్రభావతికే వచ్చేటట్టు తర్ఫీదు ఇచ్చింది. కన్నతండ్రి ఎప్పుడైనా కనిపెట్టినా "పిల్లకి పనిపాటలొస్తాయి అది మంచిదేకదా" అని ఒకసారి.

"పాపం భ్రమర మాత్రం ఒక్కర్తీ ఎంతకని చేస్తుంది? అదే వాళ్ళమ్మకైతే చెయ్యరా" అని మరొకసారి.

"కన్నతల్లి కంటే ఎక్కువగా చూస్తోంది. సవతి తల్లయినా అంతకంటే ఏం కావాలి" అని వేరొకసారి సరిపెట్టుకున్నాడు.

ప్రభావతి పదవక్లాసు పాసవగానే చదువుకు స్వస్తి చెప్పించింది భ్రమరాంబ. పెళ్ళి చెయ్యాల్సిన పిల్లకి యింకా చదువెందుకు అంది. ప్రభావతి పూర్తిగా వంట యింటి పక్షి అయిపోయింది. ఆ పిల్లకి ఏదైనా చెప్పడానికి బెరుకు, భయం. తను వంట చెయ్యను అని చెప్పడానికి ఏదో తెలియని పిరికితనం. ఎప్పుడూ ఇల్లు ఊడ్చడం, అంట్లు సర్దడం, వంట చేయడం, అన్నాలు పెట్టడం, కంచాలు తీయడం – ఇదే పని.

పదిహేనేళ్ళు నిండేసరికి ఆమె వంటలో ప్రావీణ్యత సంపాదించింది. కాని ఆ లేత మనసుకి వంట చేయడమంటే ఒకరకమైన చిరాకు, అసహ్యం బయలుదేరింది. వీలైతే ఆ వంట గిన్నెలన్నీ వీధిలోకి విసిరేసి, పప్పులు, బియ్యాలూ విరజిమ్మేసి, కూరగాయలు గోతిలో పాతేసి, గ్యాసు పూర్తిగా విప్పి వెలిగించేసి ఎటైనా పారిపోవాలని వుంటుంది.

కానీ భయం, బెరుకు – అందుకే నోరు మూసుకుని పని చేస్తూనే ఉంటుంది. పోనీ కదా అని భ్రమరాంబ ఒక్కపూట కూడా కలియబడి చెయ్యదు. ఎప్పుడైనా చెయ్యాల్సి వస్తుందని భయమేస్తే వెంటనే మంచమెక్కేసి మూల్గడం మొదలుపెడుతుంది.

అందుకే ప్రభావతికి కనిపించే ఒకే ఒక విముక్తి మార్గం పెళ్ళి. తనకి త్వరగా పెళ్ళయి అత్తారింటికి వెళ్ళిపోతే ఈ నరకం తప్పుతుంది అందుకే నారాయణమూర్తిగారు సంబంధం చేస్తే, వెంటనే ఖాయమయితే బాగుండుననుకుంది.

❖ ❖ ❖

నారాయణమూర్తిగారొచ్చి పూర్తి వివరాలు చెప్పడంతో రఘు ఈ సంబంధానికి మరింత శ్రద్ధ చూపించాడు. అన్నయ్య రామారావు పొడిపొడిగా మాట్లాడి వదిలేశాక, రఘు తనే స్వయంగా అన్ని విషయాలూ తెలుసుకున్నాడు.

"మూర్తిగారూ! పిల్లకి పనిపాటలొచ్చా?" అన్నాడు.

"నిక్షేపంలావచ్చు. ఒక్కమాట చెప్పనా! ఆ పిల్లకి సవతి తల్లి. ఇంట్లో పనంతా ఈ పిల్లే."

"నాకు కావలసిందదే. నాకు పెద్ద చదువులు వుండాలనీ, ఉద్యోగాలు చెయ్యాలనీ లేదు. నా భార్య చక్కగా యిల్లు సర్దుకోవాలి. సుష్టుగా వంట చెయ్యాలి, నాకు అన్నీ చేసి పెట్టాలి" అన్నాడు.

నారాయణమూర్తిగారు ఆనందంగా తల ఊపి

"సరిగ్గా నీకెలాంటి పిల్ల కావాలనుకుంటున్నావో అలాంటి పిల్ల ప్రభావతి. కొంచమే చదువుకుంది. పొద్దునే లేచింది మొదలు పనిపాటలతో బొంగరంలా తిరుగుతుంది".

"సరే, మీ మాటే నమ్మకం. ఖాయం చేయించండి" అన్నాడు రఘు.

అతని మనసు ఆనందంతో పరవశించింది. ఇన్నాళ్ళకి తనకంటూ ఒక ఇల్లూ వాకిలి, భార్యా యింటి భోజనం, ఆ ఆనందంలోంచి ఆలోచన గతంలోకి ఒక్కసారి దూకింది.

రఘు పదిహేనేళ్ళ పిల్లాడుగా వున్నప్పుడు అతనికి తల్లిపోయింది. అప్పటికే అన్నయ్యకి పెళ్ళయి వదిన భవాని కాపురానికొచ్చింది. చిన్నప్పుడే తండ్రి పోవడం వల్ల, రఘు భారం రామారావు భవానుల మీద పడింది. నిజానికి డబ్బు కోసం చూసుకోవాల్సిన అవసరం లేకపోయినా, మరిదికి పట్టెడన్నం పెట్టి ప్రేమగా చూడడానికి భవానీ విలవిల్లాడిపోయింది. ఆమెకా కుర్రాడ్ని చూస్తే తగని మంట. తన దురదృష్టం కొద్దీ ఆ పిల్లాడు తన మెడకి చుట్టుకున్నాడని బాధపడేది. రామారావు ఏదో లోకం కోసం తమ్ముడ్ని చూసినా భార్యమాటే అతనికి వేదవాక్కు. అతను ఏనాడూ తమ్ముడ్ని అభిమానంగా చూడలేదు. అతని అవసరాలు గమనించలేదు. కలిసి వున్న ఆస్తిలో అవకాశం వున్నంత ఖర్చు పెట్టుకోవచ్చనీ. లెక్కాపత్రం అవసరం వుండదని మాత్రమే తమ్ముడ్ని తన పంచన వుండనిచ్చాడు.

భవాని రఘుని తిండి పెట్టక హింసించింది. ఏదో ఆమెకి తోచింది చేసి, చిన్న గిన్నెల్లో పదార్థాలు సర్ది అతనికి వేరే పెట్టేది. అవి రఘుకి చాలినా, చాలకపోయినా బాగున్నా బాగోకపోయినా పాడయిపోయినా పట్టించుకునేది కాదు. రఘు పెదవి విప్పితే 'గయ్'మని విరుచుకుపడేది.

"వెధవ సంతకి చేసి పెట్టలేక చచ్చిపోతున్నాను" అంటూ రాగాలు తీసేది. రామారావు వెంటనే కల్పించుకుని "పెద్దవాళ్ళనీ గౌరవించడం నేర్చుకో. ఒక్క పూట కాస్త తిండి తగ్గితే చచ్చిపోతావా?" అంటూ కేకలేసేవాడు. రఘు బిక్కచచ్చిపోయి, వారం రోజులు అన్నం సహించక కుమిలిపోయేవాడు. రఘు పెరుగుతున్న కొద్దీ తన స్థితి బాగా అర్థం చేసుకున్నాడు. బాగా చదువుకున్నాడు. మంచి ఉద్యోగం సంపాదించు కున్నాడు. లాయరు సహాయంతో తన వాటా ఆస్తి తనవైపు తిప్పుకున్నాడు. ఊరికే లోకం దృష్టిలో తనకి అన్నా, వదినా ఉన్నా, తను ఒంటరివాడినని తెలుసుకున్నాడు.

అందుకే పెళ్ళి విషయం అన్నయ్య శ్రద్ధ వహించకపోయినా తనే మాట్లాడుకున్నాడు.

రఘు చిన్న వయసులో దెబ్బతిన్నాడు. అందుకని అతనికి రుచిగల భోజనమంటే పిచ్చి. అతను దేనికీ ఇవ్వనంత ప్రాముఖ్యం భోజనానికిస్తాడు. అతనిలో తిండి కోరికలు, రుచులురోజు రోజుకీ పెరిగిపోతున్నాయి. ఎప్పుడో తల్లి చేసిన వంటకాలు గుర్తుకొచ్చి అతనికి నోరూరుతుంది. అవి బజార్లో దొరికేవి కూడా కాదు.

అందుకే అతను ప్రభావతిని ఎంపిక చేసుకున్నాడు. చదువు తక్కువైనా, ఎక్కువ కట్నం అడగలేదు. పెళ్ళిచూపులు నిశ్చయం, పెళ్ళీ, చకచకా జరిగిపోయాయి.

❖ ❖ ❖

మొదటి రోజు ప్రభావతి వంట రుచి చూసి రఘు చకితుడయ్యాడు. అరిందాలా అరటికాయ ఆవపెట్టి కూర, దోసకాయపప్పు, అవియలు, కొబ్బరికాయ పచ్చడి అద్భుతంగా చేసింది.

"అబ్బ! ఇంత అమృతంలా ఎలా చేయగలిగావు ప్రభా!" అంటూ భర్త మెచ్చుకుంటుంటే ప్రభావతి రెండు మూడు రోజులు పరవశించిపోయింది.

అయితే రోజులు గడుస్తున్నకొద్దీ ప్రభావతి జీవితంలో మార్పు. కొత్తదనం లేకుండాపోయింది. రఘుకి రోజు రోజుకీ తిండి ధ్యాస పెరిగిపోసాగింది. అతను జీవితంలో తిండికిచ్చినంత ప్రాముఖ్యం మరిదేనికీ యివ్వడనే అనుమానం ఆమెకి కలిగింది. నెల్లాళ్ళు గడిచినా అతనెప్పుడూ తన వంట బాగుందని రుచులు చెప్తూ, లొట్టలేస్తూ భోజనం చెయ్యడమే చూసిందిగానీ, తనతో మరే విధమైన అనురాగ సంభాషణ చేసిన పాపాన పోలేదు.

"నువ్వెంత బాగుంటావు ప్రభా!" అనెప్పుడూ అనలేదు.

"నీకీ చీర చాలా బాగా నప్పింది సుమా" అని కూడా ఎప్పుడూ అనలేదు. ఏదో భోజనం చేశాక, యాంత్రికంగా సాగిస్తున్న సంసార జీవితమే తప్ప, కొత్త కాపురంలో వుండే మధురిమలు తామనుభవించటం లేదని ప్రభావతి గ్రహించింది. ఆమెలో అసంతృప్తి సన్నని మంటలా గుండెల్లో రగిలింది.

❖ ❖ ❖

ఆ రోజు రఘు యింటికి ఆలస్యంగా వచ్చాడు. అతనొచ్చేసరికి తొమ్మిదైంది. ప్రభావతి చీకటిపడకుండానే వంట చేసి, స్నానం చేసి నీటుగా తయారై కూర్చుంది.

ఎదురుచూసి ఎదురుచూసి నిద్రలోకి జారుకుంది. రఘు తలుపు తడితే వులిక్కిపడి లేచి తలుపు తీసింది. రఘు లోపలికొస్తూ "ఈ రోజు ఆఫీసులో పనుండి లేటయింది. అటే ఓ ఫ్రెండ్‌తో మార్కెట్‌కెళ్ళాను. అక్కడ చూడు! ఆకాకరకాయలు వచ్చాయి. తెచ్చాను. వెంటనే కూర చెయ్" అన్నాడు.

"ఇప్పుడా" అంది ఆశ్చర్యంగా.

"ఏం? ఇప్పుడే" అన్నాడు రఘు స్నానానికి వెళ్తూ.

"ఇంత పొద్దుపోయి యిప్పుడు వంటేమిటి? అయినా వంటెప్పుడో అయిపోయింది" అంది విసుగ్గా.

"మరేం ఫర్వాలేదు, చెయ్యి. నాకు తినాలని వుంది తెచ్చాను. ఎప్పుడో గాని దొరకవు."

"రేపు వండుకుందాం"

"వద్దు. ఇప్పుడే చెయ్."

"ఒక కూర చేశాను" ఏడుపుగొంతుతో అంది.

"రెండు కూరలూ తింటాను. చూడూ! ఇంతసేపు వాదించేకంటే పని మొదలు పెడితే సగం పని అయ్యేది" అంటూ బాత్‌రూమ్‌లో కెళ్ళిపోయాడు.

ప్రభావతి మూతి ముడుచుకుని కూర చేసింది. రఘు మామూలుగానే ఆప్యాయంగా తిన్నాడు గానీ ప్రభావతి మూడ్ పట్టించుకోలేదు ఆమెని లాలించలేదు. కాస్త కోపం ప్రదర్శించన ఆమెకి భర్త తిరస్కారమే మిగిలింది. సుష్టుగా భోం చేసి గుర్రు పెట్టి నిద్రపోయాడు. ఆమె అవమానంతో దుఃఖపడిపోయింది. నెల్లాళ్ళ వివాహ జీవితంలో రెండు సినిమాలకెళ్ళారు. దానికి ముందు ఎంతో ప్రిపేరయి, వంట పూర్తి చేసి, మళ్ళీ రాత్రి వచ్చాక వడియాలనీ, అప్పడాలనీ అవీ యివీ అంటూ అడిగినవన్నీ చేస్తే అతను సంతృప్తిపడ్డాడు.

ఒకసారి ధైర్యం చేసి "ఈవేళ సాయంత్రం హోటల్లో భోంచేద్దాం" అంది. ఆ ఊహని అతను మొగ్గలోనే తుంచేశాడు.

"ఛా ఛా! హోటల్లోనా నాకు పరమ అసహ్యం హాయిగా యింట్లో వండుకుని తినక, హోటలెందుకు డబ్బు దండగకీ, ఆరోగ్యం చెడడానికీ" అని మామూలుగా వంట చేయించాడు. ఆ క్షణంలో ప్రభావతి పెనం మీంచి పొయ్యిలో పడినట్లు అనుభూతి పొందింది.

❖ ❖ ❖

రోజు రోజుకీ ప్రభావతి బతుకు దుర్భరంగా ఫీలవడం మొదలుపెట్టింది. ఏదైనా ఊహలోనే వుంటుంది. మనసు ఉల్లాసంగా ఉత్సాహంగా వుంటే చేసే ప్రతి పనీ సులువుగా వుంటుంది. కానీ మనసు మొరాయించి, అసంతృప్తి చోటు చేసుకున్నప్పుడు గోరంతలు కొండంతలుగా కనిపిస్తాయి. చిరాకు పరుస్తాయి. ప్రభావతి యిలాంటి మానసిక దురవస్థకి గురైంది. ఆమెలో ఎన్నాళ్ళగానో మరుగునపడిపోయిన స్వేచ్ఛ తాలూకు వూహ క్షణక్షణం ఊడలు దిగుతున్న మర్రి వృక్షంలా పెరిగిపోసాగింది. ఎలాగైనా తనీ బానిసత్వం నుండి బయటపడాలి. ఏం? తనకంటూ ఒక యిష్టం లేదూ? తనకి మాత్రం విశ్రాంతి అవసరం లేదూ? ఎప్పుడూ ఎదుటివాళ్ళు చెప్పినట్లు చెయ్యడమేగానీ తనిష్టమంటూ ఎప్పుడూ వుండదా? ఇలాంటి ఆలోచనలతో మనసు కుతకుతలాడిపోవడం మొదలుపెట్టింది. సవతి తల్లి చచ్చేట్టు పని చేయించినప్పుడామెకి సుదూరంలో పెళ్లి - మొగుడు - సంసారం అనే అంశాలు ఆశలుగా కనిపించేవి. అప్పుడామెంతో పిరికిగా భయంగా వుండేది. ఇప్పుడెందుకో అవన్నీ మాయమై పోయాయి. ఆమెకి భవిష్యత్తు నిప్పంటుకుని తగలబడిపోతున్న పూలతోటలా వుంది. ఏదో ఆరాటం, ఏదో ఆవేశం, బయటపడాలనే తాపత్రయం, తలుపులు బంధించిన గదిలో ఇరుక్కుపోయిన పిల్లిలా ఆమె కర్కశంగా ఆలోచిస్తోంది.

చూసినవాళ్ళకీ, విన్నవాళ్ళకీ చాలా స్వల్ప విషయాలుగా కనిపించేవి, కొందరికి చాలా సీరియస్‌గా కనిపించి రగిలిపోతారు. అందుకే సమస్యకి వెనుక వ్యక్తి స్వభావం, వారి పెరకువ. వారి ఆర్థిక, సాంఘిక పరిస్థితులు - వారి ఆరోగ్య అనారోగ్యాలు అన్నీ ముడిపడి వుంటాయి. దీనివల్ల కొందరు ఎదుర్కొనే సమస్యలు మరికొందరికి చాలా దండుగమారి సమస్యల్లా కనిపిస్తాయి. ప్రభావతి గత జీవితానుభవం, భావి జీవితాన్ని కూడా నాశనం చేయబోతోంది.

రఘు రోజు రాత్రి ఏడుగంటలకి, ఎనిమిది గంటలకొచ్చి తనక్కావలసిన పెసరట్లు చెయ్యమని, పకోడీలు చెయ్యమని, పనసపొట్టు కూర చెయ్యమని వేదించటం మొదలుపెట్టాడు. అతనిలో ఇన్నాళ్ళూ నిద్రాణంగా వున్న తిండి మీద కోరికలూ కాలనాగులై బుసలుకొట్టడం మొదలుపెట్టాయి.

'తనిష్టం. తనకి కావలసినవి తను అడిగి చేయించుకుంటాడు తప్పా?' కనీసం తిండిలోనైనా తృప్తి లేకపోతే యిక జీవితం ఎందుకు? అయినా తనెందుకు సర్దుకుపోవాలి? ఇన్నాళ్ళూ తన కోసం ఎవరూ దేనికీ సర్దుకుపోలేదు. అందుకే పెళ్ళి

చేసుకున్నాడు. రఘు ఆలోచనలకి అదుపూ, ఆజ్ఞ లేకుండా సాగేవి. అంతే గానీ సాటి మనిషి కష్టసుఖాలుగానీ, ఆమె మానసిక స్థితిగానీ, భర్తగా తన బాధ్యత గానీ అతనికి స్ఫురించలేదు.

❖ ❖ ❖

ఆ రోజు ప్రభావతి పూర్తిగా మొండికేసింది.

"నేను చెయ్యను" అని ధైర్యంగా చెప్పింది.

"ఎందుకు చెయ్యవు? చేసి తీరాలి" అని అతను నిలవేశాడు.

"నాకీ వేళ వంట్లో బాగుండలేదు" అంది.

"బాగుండకపోతే కొంచెమే చెయ్యి. వంట చెయ్యకపోతేనా భోజనం ఎలా?" అన్నాడు.

"ఏమో?" అంది.

"ఏమో అంటే కాదు. ఒక గంట కూడా పట్టదు. చేసి పెట్టు నే వెళ్ళిపోయాక పడుకో. నేను సాయంత్రం దాకా రాను" అన్నాడు.

"నేను చెయ్యలేను. అని చెప్తుంటే"

"అదే ఎందుకు అంటున్నా."

"ఏం? నేనెప్పుడూ అలా చెప్తున్నానా."

"ఎప్పుడూ చెప్పడానికి వీల్లేదు. ఏం? ఆడదానివి వంట చెయ్యడానికి ఏడ్చి చస్తావేం. వంట తప్పిస్తే నీకింకో పనేముంది? ఆడదంటే వంట చెయ్యడానికే. వుందని నీకు తెలీదా?" అంటూ ఎగిరాడు. ప్రభావతికి ఒళ్ళు మండిపోయింది.

"ఆడది వంట చెయ్యడానికే లేదు. అలా మీరనుకుంటే అది మీ ఖర్మ. మీకు వంట మనిషే కావాలనుకుంటే పెళ్లెందుకు చేసుకున్నారు? ఒక చక్కని వంటవాడ్ని పెట్టకోకపోయారా" అంటూ తారాస్థాయినందుకుంది ప్రభావతి.

రఘు ఆవేశంతో ఊగిపోయాడు. ఆడదానికంత అహంకారం కూడదన్నాడు. తాడోపేడో తేల్చేస్తానన్నాడు. 'నా ఖర్మ' అనేదాకా వచ్చావా అంటూ ఎగిరాడు. చదువు తక్కువగా 'వుంటే బుద్ధిమంతురాలవనుకున్నాను' అంటూ నిందించాడు. ఇంకా ఎన్నెన్నో మాటలు అన్నాడు.

ప్రభావతి మనసు పూర్తిగా విరిగిపోయింది. మనుషుల మధ్య బంధాలు పెంచేవైనా, తెంచేవైనా మాటలే - మాటల వలనే ఒకరియందొకరు అనురాగాన్నీ,

అసహ్యాన్ని ఏర్పరచుకుంటారు. మాటమీద మాట పెరిగితే, పంతాలు, అహంకారాలు రగిలితే మహా మహా సామ్రాజ్యాలే కూలిపోతాయి. ఇక మామూలు సంసారలనగా ఎంత?

❖ ❖ ❖

వెక్కి వెక్కి ఏడుస్తున్న ప్రభావతి తల మీద నెమ్మదిగా నిమిరి "ఏమిటమ్మా ప్రభావతీ! ఇది ... నువ్వు కొంచెం ఓర్పుగా వుండాలమ్మా" అన్నారు నారాయణ మూర్తిగారు.

"అవునండీ బాబయ్యగారూ! నా జీవితం యిలా అయిపోతుందని నేనూ అనుకోలేదు. మీకు తెలుసో తెలీదో, పుట్టింట్లో వున్నంతకాలం వంట యిల్లు మెడకి కట్టారు. నోరు మూసుకుని చేశాను. అప్పుడు నాకు ఆశ – పెళ్ళి. కానీ ఇప్పుడు చూడండి! అదేమి దరిద్రమో ఎప్పుడూ తిండి తిండి, ఎంత చేసి పెట్టినా తృప్తి లేదు ఆ కోరికలకు అంతులేదు. ఒక వేళాపాళాలేదు. ఎదుట వున్నది కూడా మనిషేనన్న ధ్యాసలేదు పైగా ఆడదానికి వంట చేయడమే పనిట చేయననే హక్కు లేదట మీరే చెప్పండి! ఒక వంట మనిషిగానే వుండదల్చుకుంటే ఇంత కష్టపడి పెళ్ళి చేసుకోవడ మెందుకు? ఎక్కడైనా వంట లక్కగా కుదిరితే ఇంత జీతమిస్తారు. వాళ్ళ పనివాళ్ళకి చేశాక నాకు కావలసినంత మానసిక స్వేచ్ఛ. ఇలా జీవితాంతం బానిసత్వం వుండదుగా, మనసు చంపుకుని, గొడ్డు చాకిరీ చేస్తూ సేవలు చేస్తుంటే ఆడది కేవలం వంట చేయడానికే అనడం తప్పు కాదా! బాబయ్యగారూ! మీరే చెప్పండి. నాకెప్పుడూ వంట్లో బాగుండకపోకూడదట. ఎప్పుడూ బద్ధకంగా, వంట చెయ్యడం విసుగ్గా అనిపించకూడదట. నేను మనిషిని కానా?" ఏడుస్తూ, ఆవేశంగా చెప్పింది ప్రభావతి. నారాయణమూర్తిగారు ఆశ్చర్యంగా చూస్తూండిపోయారు. ఇలాంటి సమస్య ఒకటి వుంటుందని, అదీ ఒక సమస్య అని ఆయనకిప్పుడే తోచింది.

❖ ❖ ❖

"మీరే చెప్పండి. చిన్నప్పటినుంచి అమ్మపోయి తిండీ తిప్పలూ లేక నానా అవస్థలూ పడ్డాను. ఇన్నాళ్ళకి నాదంటూ యిల్లు ఏర్పడింది. అదీ ఇదీ కావాలని అడిగితే నానామాటలూ అంటుందా? నేను ముందే చెప్పాను. చెప్పానా లేదా? నాకు పెద్ద చదువులు చదువుకున్న అమ్మాయి అవసరం లేదు. ఇల్లు వాకిలీ సర్దుకోవాలి. నాకు కావలసినవి చేసి పెట్టాలి అని" అంటూ రఘు నిక్కచ్చిగా అడుగుతుంటే,

నారాయణమూర్తిగారేం మాట్లాడలేకపోయారు. అతను చెప్పింది అతని దృష్టిలో నిజమే కదా!

❖ ❖ ❖

ఇప్పుడేం చెయ్యాలి? నారాయణమూర్తిగారు తీవ్రంగా ఆలోచించటం మొదలుపెట్టారు. వంద అబద్ధాలాడి పెళ్ళి చేసే రోజులు కావివి. జరిగిన పెళ్ళిని నిలబెట్టడానికి ఎన్నో వాస్తవాల్ని నిరూపించాల్సిన రోజులివి - ప్రభావతిని ఆదరించి ధైర్యం చెప్పి, లాలించి మార్గం చూపే తల్లి లేదు. అంతా పెంకిపిల్ల కాపరం వదులుకుంది అంటారు ఆమెని. ఆమె పెంకి పిల్లకాదు.

మూర్ఖుడు పెళ్ళాన్ని ఎలా చూసుకోవాలో తెలీదు అంటారు రఘుని - అతను మూర్ఖుడు కాదు. వారి బాల్యాలలో వారి మీద పడిన రాక్షస ముద్రలు అలాంటివి. ఊహలతో ఉద్రేకాలతో తెగేవరకు లాగే ఈ యిద్దర్నీ ఆదుకోవాలి. ఈ కాపురం నిలబెట్టాల్సిన నైతిక బాధ్యత నాకుంది అనుకున్నారు నారాయణమూర్తిగారు.

❖ ❖ ❖

నారాయణమూర్తి గారి భార్య సుశీలమ్మగారు విషయమంతా విని విలవిల్లాడి పోయింది.

"ఏమండి నేనొకటి చెప్తాను వినండి. వారిద్దరినీ మనింటికి ఓ పది రోజులుండేలా రమ్మని ఆహ్వానించండి. వారిద్దరూ నా దృష్టిలో పసిపిల్లలు. మన పిల్లలలాంటివారే. వారిద్దరికీ తెలిసి చేసినా తెలియక చేసినా ఇద్దరు స్త్రీలే ద్రోహం చేశారు. నేను ఒక స్త్రీగా వారి మనసులు కలపటానికి ప్రయత్నం చేస్తాను" అన్నారామె దృఢంగా.

రెండు రోజులు పుట్టింట్లో వుండేసరికి ప్రభావతికి నరకప్రాయంగా వుంది. సవతి తల్లి బాహాటంగానే సాధించడం మొదలుపెట్టింది.

"ఏమోనమ్మా! ఎక్కడా కనివినీ ఎరగం! వంటచెయ్యడం విసుగంటే ఆడదానికెలా గడుస్తుందిట. మేమంతా చేసుకోవడం లేదూ; మరి రోజూ వంటే చేస్తున్నాం. ఏమోనమ్మ... వంట చెయ్యమన్నాడని పుట్టింటికి వెళ్ళిపోదామని ఎప్పుడూ వూహే రాలేదు. సాగితే సరి, ఏమైనా చేస్తారు... హు. ఏమైనా అంటే సవతితల్లి అని నన్నాడిపోసుకుంటారు ఇప్పటికే వచ్చిన చెడ్డపేరు చాలు. పనిపాటలు నేర్పకుండా సోమరిలా పెంచింది అని అంటున్నారు. ఏమోనమ్మా! తల్లి లేని పిల్లని అపురూపంగా చూశానే గాని, ఇలా నాకే ఎదురొస్తుందనుకోలేదు..." ఇలా సాగుతూనే వుంది భ్రమరాంబ ధోరణి.

ప్రభావతికి కడుపు మండిపోయింది. అసహాయత దుఃఖంగా మారి కన్నీరు వరదలైంది. సరిగ్గా అప్పుడే నారాయణమూర్తిగారొచ్చి పిల్చారు. వెంటనే తండ్రికి చెప్పి చిన్న సంచీ తీసుకుని ఆయనతో బయల్దేరింది.

❖ ❖ ❖

రఘు విసుగ్గా కూర్చున్నాడు. రెండు రోజులుగా హోటలు భోజనం. జిహ్వా చచ్చిపోయింది. పెళ్ళి అయి రెండు నెలలైనా కాకుండానేఇలా జరిగిందేమిటా అని బాధగా వున్న సమయంలో వదిన భవానీ పరుగెట్టుకొచ్చింది.

"ఏమిటోయ్ ఇది మనింటావంటా లేదు. కొంత సర్దుకుపోవాలి. ఎప్పుడూ ఒకలాగే సాగుతుందా నేనైతే, అయ్యో మన పిల్లాడని రాత్రనక, పగలనక నీకోసం ప్రత్యేకం చేసి పెట్టేదాన్ని. అయినా ఆ పిల్లకంత పొగరేమిటి మరీనూ" అంటూ సానుభూతి వాక్యాలు, సాధింపులు, సొంతడబ్బాలు, పుల్ల లెక్కించడాలు అన్నీ చేసి వెళ్ళింది.

సరిగ్గా అప్పుడే నారాయణమూర్తిగారు, వచ్చి రఘుని ఆప్యాయంగా పలకరించి "మా ఇంటికి రాబోయి. నాలుగు రోజులుండి వద్దువుగాని అంటూ బలవంతం చేశారు. రఘు బయలుదేరాడు.

చిత్రం! ఇద్దరూ అక్కడొకర్ని ఒకరు చూసి ఆశ్చర్యపడ్డారేగానీ అసహ్యించుకోలేదు.

❖ ❖ ❖

రఘుకి, ప్రభావతికి చచ్చిపోయిన తమ తల్లులిద్దరూ సుశీలమ్మగారి రూపంలో వచ్చినట్లనిపించింది. ఆదరణ కరువైన ఆ ఇరు హృదయాలు ఆప్యాయతను చవి చూశాయి. సమయం చూసి "నాయనా రఘూ! ఇది జీవితం. ప్రతిదానికీ తొందర పడితే కుదరదు. మీ యిద్దరూ విడిపోతే మిమ్మల్ని హేళన చేసి వినోదించేవారే ఎక్కువ. మీరు సర్దుకుపోలేని దారుణమైన పరిస్థితులుంటే ఏమైనా కలిసే వుండమని నేనూ చెప్పను. కానీ ఒక్కటి. ఈ ప్రపంచంలో ఏ ఇద్దరు వ్యక్తులు కలిసి బతకాలనుకున్నా కొంత కాంప్రమైజ్ కాక తప్పదు. ఈమెని కాదని మరొకామె దగ్గరికి వెళ్ళినా, అక్కడా మరేదో సర్దుబాటు తప్పదు. ప్రభావతి చిన్నపిల్ల. చిన్నప్పటినుంచి ప్రేమాభిమానాలు కరువైపోయి గొడ్డుచాకిరీ చేస్తూ వచ్చింది. ఆమెని ఆదరించి ప్రేమించాల్సిన బాధ్యత నీకుంది. ప్రేమతో జయించలేనిదేదీ లేదు" అన్నారు నారాయణమూర్తిగారు. రఘు తలొంచుకుని నెమ్మదిగా అన్నాడు "నేనూ అదే ఆలోచిస్తున్నాను. మీరు నాకెంతో



కథా నిలయం
శ్రీకాకుళం

మెత్తగా స్పష్టంగా చెప్పారు. నేనూ జాగ్రత్తగా వుంటాను. ప్రభావతిని జాగ్రత్తగా చూసుకుంటాను" అన్నాడు నారాయణమూర్తిగారు ఆనందపడిపోయారు.

❖ ❖ ❖

చూడమ్మా! ప్రభావతీ! నువ్వు చిన్నపిల్లవు. లోకం తెలీదు పెళ్లి అనేది తెంచుకోవడం ఏమంత కష్టం కాదు. కానీ బంధం నిలుపుకోవడమే కష్టం. రఘు మంచి కుర్రాడు. నీలాగే చిన్నప్పుడే తల్లిపోయి, ప్రేమాభిమానాలకు నోచుకోలేదు. హాయిగా తిని తిరిగే వయస్సులో తిండికి బాధపడ్డాడు. వదిన గయ్యాళి. అందువల్ల కొంచెం తొందరపడి నిన్నిబ్బంది పెట్టినా, నోటి రుచి కోసం అవీ యివీ అడిగినా నువ్వు సర్దుకోవాలి, అతన్ని ప్రేమించి అతనితో జీవించటం నీ ధర్మం. భర్తే దైవమనీ, వాడెంత దుర్మార్గుడైనా వాడి పాదసేవే చెయ్యాలనీ నేనెప్పుడూ అనను. అది చాలా తప్పుడు భావన. కానీ స్త్రీ పురుషులు ఇద్దరూ ఒకరితో ఒకరు కలసి బతకాలనుకుంటే ఎంతో కొంత ఓర్పు, సహనం కావాలి. ఇద్దరికీను. అతన్ని కాదని మరొకరి దగ్గరికి చేరినా, అక్కడ కూడా ఏవో లోటుపాట్లు వుంటాయి. సర్దుకోక తప్పదు! సుశీలమ్మగారు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రభావతి తలొంచుకుంది. నెమ్మదిగా అంది "పిన్నిగారూ! నిజమే మీరు చెప్పింది నేను అర్థం చేసుకున్నాను. ఆ సమయంలో చిరాకేసి అలా అన్నాను. రెండు రోజులుగా బాధగానే వుంది. మీ యింటికి పిలవడం వల్ల కాస్త మనశ్శాంతి లభించింది. నేను జాగ్రత్తగా సర్దుకుంటాను. మా అమ్మే మీ రూపంలో వచ్చి నాకు చెప్పిందనుకుంటాను" అంది.

సుశీలమ్మగారు మనసు ఆనందంతో పరవశించిపోయింది.

❖ ❖ ❖

మూడు రోజులు సుశీలమ్మగారు కమ్మగా వండి నూతన వధూవరులకిద్దరికీ వడ్డించింది. కారణాలు చిన్నవి. కలతలు చిన్నవి. దుడుకు వయసు పిల్లలకి మనసు విప్పుకునే అవకాశం వుండాలి. ఆదరణ వుండాలి. భార్య మీద భర్తకి భర్త మీద భార్యకి కొండేలు చెప్పని సంస్కార వంతులైన వారి సాంగత్యం వుండాలి. అప్పుడు ఎన్నో కూలిపోయే సంసారాలు నిలబడతాయి. ఆ రోజు కనుచీకటి పడేవేళ ప్రభావతి భర్తతో "ఎప్పుడెళ్దాం మనింటికి" అంది.

"నీ యిష్టం" అన్నాడు మెరిసేకళ్ళతో రఘు.

"రేపు ఉదయం వెళ్దామా" అంది ప్రభావతి స్నేహంగా.

రఘూ ప్రభావతి తమ కాళ్ళకి మొక్కుతుంటే ఆ దొడ్డ మనసు పెద్దవాళ్ళు "దీర్ఘాయుష్మాన్‌భవ!!" అన్నారు.

వారిద్దరు మాత్రం - దేశానికి నారాయణమూర్తిగారు సుశీలమ్మగారి లాంటి వారు ఏ ఇద్దరున్నా చాలు అనుకున్నారు మనసుల్లో.

(ఆంధ్రపత్రిక- 22.9.1989)